# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 26 జూన్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## రెండుసార్లు 10వ తరగతి పరీక్షలు

- సీబీఎస్ఈ కీలక నిర్ణయం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏడాదికి రెండుసార్లు 10వ తరగతి బోర్డ్ ఎగ్జామ్స్ నిర్వహించనుంది. ఫిబ్రవరిలో మొదటిసారి, మేలో రెండోసారి నిర్వహించాలని నిర్ణయించింది. తొలివిడత ఫలితాలు ఏప్రిల్‌లో, రెండో విడత ఫలితాలు జూన్‌లో విడుదల చేయనుంది. అయితే, ఫిబ్రవరిలో జరిగే తొలి విడత పరీక్షలకు తప్పనిసరిగా హాజరు కావాలని వెల్లడించింది. మేలో జరిగే పరీక్షలను విద్యార్థులు మార్కులు పెంచుకునేందుకు రాసుకోవచ్చని సూచించింది. ఈ రెండు విడతల్లో వచ్చిన ఉత్తమ స్కోరును సీబీఎస్ఈ పరిగణనలోకి తీసుకోనుంది. నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం రెండుసార్లు పరీక్షలు నిర్వహించేందుకు వీలుగా ఈ నిబంధనలకు ఆమోదం తెలిపింది. ఏడాదికొకసారి ఇంటర్నల్ అసెస్‌మెంట్ ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు ఎగ్జామినేషన్ కంట్రోలర్ సన్యం భరద్వాజ్ వెల్లడించారు.

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జాతీయ నూతన విద్యా విధానానికి అనుగుణంగా సీబీఎస్ఈ పరీక్షల్లో మార్పులు చేయాలని నేషనల్ కరికులమ్

మిగితా 2వ పేజీలో




## 3 నెలల్లో పంచాయతీ ఎన్నికలు

- నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశాలు
- 30 రోజుల్లో వార్డు విభజన పూర్తి చేయాలని సూచన

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు తుది తీర్పు వెలువరించింది. పంచాయతీ ఎన్నికలను మూడు నెలల్లోపు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రక్రియలో 30 రోజుల్లో వార్డు విభజన పూర్తి చేసి త్వరితగతిన ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని న్యాయస్థానం సూచించింది. గతేడాది జనవరిలో సర్పంచుల పదవీకాలం ముగిసినప్పటికీ, ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవటంతో కోర్టులో ఆరు పిటీషన్లు దాఖలయ్యాయి. సర్పంచుల లేకపోవడంతో గ్రామాల అభివృద్ధి నిలిచిపోయిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పిటీషన్లపై విచారణ చేసిన న్యాయస్థానం సెప్టెంబర్ 30లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తిచేయాలని తుది తీర్పునిచ్చింది.

ఇకపై బీసీలకు ఇచ్చిన హామీ మేరకు 42% రిజర్వేషన్ల అమలు కోసం ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. అయితే రిజర్వేషన్లు 50% మించరాదని సుప్రీంకోర్టు నిబంధన ఉండటంతో కొత్తగా మల్లగుల్లాలు మొదలయ్యాయి. బీసీలకు 42% రిజర్వేషన్లకు అనుమతి రాకపోతే, పార్టీల ఆధారంగా రిజర్వేషన్లు చేయనున్నట్లు సమాచారం.

ఇటీవల ప్రభుత్వం కోర్టులో రిజర్వేషన్లు, వార్డు డివిజన్ ప్రక్రియకు 25 రోజుల గడువు కావాలని విన్నవించగా, ఎన్నికల కమిషన్ 60 రోజుల సమయం కోరింది. ఈ వాదనలు పరిశీలించిన న్యాయస్థానం చివరకు సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు నిర్వహించాలని తీర్పు వెలువరించింది. రిజర్వేషన్లపై విధానం త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశముంది.

## తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బోనాలు

- రాష్ట్ర ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

వివరాలు 2వ పేజీలో

# పాఠశాలల్లో సోలార్ కిచెన్లు

- భోజనం తయారుచేసే మహిళలు గ్యాస్, కట్టెల పొయ్యిల వల్ల ఎదుర్కొంటున్న కష్టాల నుంచి విముక్తి కల్పించాలి
- విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలి...
- జిల్లాల్లోని ఐఏఎస్ అధికారులు వారానికి రెండు పాఠశాలలను సందర్శించాలి..
- పాఠశాలల్లో అవసరమైన మేర నూతన గదులు నిర్మించాలి...
- పదో తరగతి ఉత్తీర్ణులైన ప్రతి ఒక్కరూ ఇంటర్మీడియట్‌లో చేరేలా చూడాలి
- విద్యా శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో మధ్యాహ్న భోజన పథకంలో సోలార్ కిచెన్ల ఏర్పాటు,చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సూచించారు. తెలంగాణలో విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు వారంలో కనీసం రెండు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని సీఎం సూచించారు. విద్యా శాఖపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో 48 వేల మంది చేరారని అధికారులు సీఎంకు వివరించారు. పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నూతన గదులు నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు అవసరమైన వసతులను పాఠశాలల్లో కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. మధ్యాహ్న భోజనం తయారీకి సంబంధించి గ్యాస్, కట్టెల పొయ్యిల బాధల నుంచి మధ్యాహ్న భోజనం తయారు చేసే మహిళలకు విముక్తి కల్పించాలని... సోలార్ కిచెన్ల ఏర్పాటుపై తక్షణమే దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు తెలియజేశారు. పదో తరగతిలో ఉత్తీర్ణులవుతున్న విద్యార్థుల సంఖ్యకు, ఇంటర్మీడియట్‌లో నమోదు అవుతున్న విద్యార్థుల సంఖ్యకు మధ్య వ్యత్యాసం ఎక్కువ ఉండడంపై ముఖ్యమంత్రి అధికారులను ప్రశ్నించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా కచ్చితంగా ఇంటర్మీడియట్‌లో చేరేలా చూడాలని సీఎం సూచించారు. ఇంటర్మీడియట్ అనంతరం జీవనోపాధికి అవసరమైన స్కిల్ కోర్సుల్లో శిక్షణ పొందవచ్చని.. తద్వారా వారి జీవితానికి ఢోకా ఉండదని సీఎం అభిప్రాయపడ్డారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ ఏ.శ్రీదేవసేన, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.హరిత తదితరులు పాల్గొన్నారు.

## నగర జనాభాకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలి

- కోర్ అర్బన్ రీజియన్‌పైసమగ్ర పాలసీ
- 25 ఏండ్ల ప్రణాళికలు సిద్ధం చేయండిసీజనల్ వ్యాధుల వ్యాప్తి నిరోధించాలి
- మున్సిపల్ అధికారులను సీఎం ఆదేశాలు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

పెరుగుతున్న హైదరాబాద్ నగర జనాభా అవసరాలకు అనుగుణంగా రాబోయే 25 సంవత్సరాలను దృష్టిలో ఉంచుకొని అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌కు సంబంధించి ప్రత్యేకంగా సమగ్రమైన పాలసీని తయారు చేయాలని ఆదేశించారు. నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ అధికారులతో ముఖ్యమంత్రి గారు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి పనుల పురోగతిపై వివరాలను అధికారులు సమావేశంలో వివరించారు. కోర్ అర్బన్ తో పాటు సెమీ అర్బన్, రూరల్ ఏరియాలపైనా ఒక స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంటుందని, అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు సూచించారు.

H-CITI అభివృద్ధి పనులకు సంబంధించి వివరాలను అధికారులు తెలియజేయగా, ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్‌లో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి గారు చెప్పారు. తాగునీటి సరఫరా, డ్రైనేజ్, రోడ్లు, మెట్రో కనెక్టివిటీ, ఎలివేటెడ్ కారిడార్లకు సంబంధించి పూర్తి ప్రణాళికలను తయారు చేయాలన్నారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో కొనసాగుతున్న తాగునీటి సరఫరా, సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్స్ పనుల్లో ప్రస్తుత పరిస్థితిని అధికారులు వివరించారు. అసంపూర్తిగా ఉన్న పనులను సాధ్యమైనంత తొందరగా పూర్తి చేయాలని చెప్పారు. ముఖ్యంగా నగరంలో పారిశుధ్యం విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదని, వర్షాకాలంలో డెంగ్యూ, చికున్ గున్యా లాంటి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

## బనకచర్ల ప్రాజెక్టుకు జలహారతి కార్పొరేషన్



- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఒకవైపు బనకచర్లపై తెలంగాణ ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తూ ఎలాగైనా అడ్డుకోవాలని ప్రయత్నిస్తుంటే.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం శరవేగంగా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అందులో భాగంగా పోలవరం–బనకచర్ల లింకు ప్రాజెక్టు నిర్మాణం కోసం కొత్తగా ఒక ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. . ప్రాజెక్టు నిర్మాణానికి పునాది వేస్తూ, ప్రత్యేకంగా "జలహారతి కార్పొరేషన్ లిమిటెడ్" అనే ప్రభుత్వ సంస్థను ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టును సమర్థవంతంగా అమలు చేసేందుకు ఈ సంస్థ ఏర్పాటు చేయబడింది. 100 శాతం రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఏర్పడిన ఈ స్పెషల్ పర్పస్ వెహికల్ కంపెనీ అమరావతిని కేంద్రంగా చేసుకుని పనిచేయనుంది. ఈ సంస్థకు ముఖ్యమంత్రి ఛైర్మన్‌గా, జలవనరుల మంత్రి వైస్ ఛైర్మన్‌గా, ముఖ్య కార్యదర్శి సీఈఓగా బాధ్యతలు నిర్వహించనున్నారు. ప్రధానంగా గోదావరి వరద జలాలను సముద్రంలో వృథాగా పోకుండా పట్టుకుని, రాయలసీమ, పల్నాడు ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు అందించడమే లక్ష్యం అని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిర్ణయంతో రాష్ట్రం జలస్వావలంబన దిశగా ముందడుగు వేసిందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

## చట్టపరంగా బనకచర్లను అడ్డుకుంటాం



- 30 న ప్రజాభవన్ లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- మెడిగడ్డ,అన్నారం,సిందిళ్ళ బ్యారేజి ల పునరుద్ధరణకు ఎన్.డి.ఎస్.ఏ కన్సల్టెంట్ గా వ్యహరిస్తుంది
- నీటిపారుదల శాఖాలో పదోన్నతులు, బదిలీలకు గ్రీన్ సిగ్నల్
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి–బనకచర్లను చట్టపరంగా అడ్డుకుంటామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణా రైతాంగం ప్రయోజనాలకు భంగం వాటిల్ల కుండా చూడడమే తమ ముందున్న కర్తవ్యమని ఆయన తేల్చిచెప్పారు ఈ ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణా ప్రాంత ప్రయోజనాలు ఏ విధంగా దెబ్బ తింటాయో, నష్టం ఎలా వాటిల్లుతుందో నన్న అంశంలో బలమైన వాదనలు వినిపించి ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలువరిస్తామన్నారు. బుధవారం మధ్యాహ్నం ఎర్రమంజిల్ కాలనీ లోని నీటిపారుదల శాఖా కేంద్ర కార్యాలయంలో నీటిపారుదల శాఖా ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు నీటిపారుదల శాఖా ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,ఇ.ఎన్.సి మహమ్మద్ అంజత్ హుస్సేన్, ఇ. ఎన్.సి ఓ అండ్ యం డిప్యూటీ ఇ. ఎన్.సి శ్రీనివాస్ లతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు

గోదావరి–బనకచర్ల ప్రాజెక్ట్ తో తెలంగాణా కు సంభవించనున్న ముప్పును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలసి ఈ నెల 19 న కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్ పాటిల్ కు సవివరంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ను ఇచ్చామన్నారు.బంకచర్ల ప్రాజెక్టుకు సంబంధించిన ఫ్రీ–ఫిజిబిలిటీని నివేదికను ఎట్టిపరిస్థితుల్లోనూ ఆమోదించ వద్దని తేల్చిచెప్పామన్నారు.ఈ ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణా రాష్ట్ర నీటి కేటాయింపులపై ప్రభావం చూపుతుందని దానిని దృష్టిలో పెట్టుకుని నివేదికను తిరస్కరించాలని కోరామన్నారు.అందుకు స్పందించిన కేంద్ర మంత్రి పాటిల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన నివేదికను ఆమోదించ లేదని,త్వరలోనే అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని ఆయన వివరించారు పదేళ్ల బి.ఆర్.యస్ పాలనలో పుట్టుకొచ్చిన గోదావరి–బంకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తే తెలంగాణా ప్రయోజనాలకు జరిగే నష్టం పై ఈ నెల 30 న ప్రజాభవన్ లో మధ్యాహ్నం 3 గంటలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ను ఏర్పాటు చేశామన్నారు

టన్నెల్ నిర్మాణాలలో అపారమైన అనుభవం కలిగిన సుప్రసిద్ధ సైనికాదికారు లిద్దరిని నీటిపారుదల శాఖలోకి తీసుకునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయాన్నారు. ఇటీవల రోహ్తాంగ్,జోజిలా టన్నెల్ నిర్మాణంలో పనిచేసిన ఇద్దరు అధికారులను వినియోగించుకునేందుకు నీటిపారుదల శాఖా కసరత్తు చేస్తుందన్నారు.

మిగితా 2వ పేజీలో

## ఆర్టీసీలో 11 కార్మిక సంఘాలతో ఒకే జేఏసీ ఏర్పాటు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

టీజీఎస్ఆర్టీసీలో 11 కార్మిక సంఘాలతో ఒకే జేఏసీ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఇప్పటి వరకు ఆర్టీసీలో వేర్వేరుగా రెండు జేఏసీలు ఉన్న విషయం తెలిసిందే. ఒకే జేఏసీగా ఏర్పడేందుకు అనుకూలంగా గతంలోని రెండు జేఏసీలను రద్దు చేసుకుంటున్నట్లు ఆయా సంఘాల నేతలు ప్రకటించారు. మంగళవారం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న అధ్యక్షతన 11 కార్మిక సంఘాల నేతల సమావేశం జరిగింది. ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ), టీజీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్), టీఎమ్‌యూ(అశ్వత్థామరెడ్డి), టీఎమ్‌యూ (థామస్‌రెడ్డి), ఎస్‌డబ్ల్యూయూ, టీజేఎమ్‌యూ, ఎన్ఎమ్‌యూ, బీడబ్ల్యూయూ, బీకేయూ, కార్మిక సంఘ్, కార్మిక పరిషత్, ఎస్‌టీఎమ్‌యూ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఒకే జేఏసీగా ఏర్పడాలని అన్ని సంఘాలు ఏకగ్రీవంగా తీర్మానం చేశాయని ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు తెలిపారు. జేఏసీ విధివిధానాలపై చర్చించేందుకు జులై 2వ తేదీ మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు.

## కుటీర పరిశ్రమలను ప్రోత్సహిస్తాం



- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- ట్యాంక్ బండ్ పై బీసీ చేతి వత్తి కళాకారుల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకానికి సంబంధించిన స్టాల్స్ ప్రారంభం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

పెద్ద ఎత్తున ఉపాధి, ఆదాయాన్ని సష్టించే కుటీర పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. బుధవారం హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీసీ చేతి వత్తి కళాకారుల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకానికి సంబంధించిన స్టాల్స్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. చేతివత్తులు, కళాకారుల ఉత్పత్తులు సమాజానికి పెద్ద ఎత్తున ఉపయోగపడతాయన్నారు. చేతి వత్తుల ఉత్పత్తులను ప్రోత్సహించి ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. 29 వరకు ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుందని, నగరానికి చెందిన వారే కాకుండా ఇతర జిల్లాల నుంచి కుటీర పరిశ్రమలకు సంబంధించిన ఉత్పత్తుల ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ ను రాష్ట్ర ప్రజలు ఉపయోగించుకోవాలని డిప్యూటీ సీఎం కోరారు. ఈ ప్రదర్శనను తిలకించి నచ్చిన వస్తువులు, పర్యావరణహితమైన ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఉత్పత్తులు కొనుగోలు చేసి చేతి వత్తుల వారికి చేయూతనివ్వాలని రాష్ట్ర ప్రజలకు సూచించారు. బీసీ కార్పొరేషన్ల పై ప్రత్యేక దష్టి సారించి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని తెలిపారు. ఈ ప్రదర్శనలో కుమ్మరులు తయారుచేసిన మట్టి పాత్రలు, మేదరి వారు తయారు చేసిన వెదురు వస్తువులు, పూసల వారి సామగ్రి, అదే విధంగా పోచంపల్లి, గద్వాల, నారాయణపేట మొదలైన చేనేత ఉత్పత్తులు గౌడ అన్నలతో ఏర్పాటుచేసిన నీరా ఉత్పత్తులు, వారు తయారు చేసిన వస్తువులను డిప్యూటీ సీఎం ఆసాంతం పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బెస్త సోదరులచే ఏర్పాటుచేసిన చేపల వంటకాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిలతో కలిసి డిప్యూటీ సీఎం ఆరగించారు.

## భూసంబంధిత సమస్య పరిష్కరిచండి

- కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామిని కోరిన మంత్రి శ్రీధర్‌బాబు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కేంద్ర పరిశ్రమల భూసంబంధిత సమస్య పరిష్కారానికి తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు బుధవారం కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి హెచ్.డి. కుమారస్వామితో న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో సిపిఎస్‌యూ భూముల సమస్యపై కేంద్రానికి వినతులు సమర్పించారు. తెలంగాణలో దశాబ్దాల క్రితం పరిశ్రమల అభివృద్ధి కోసం కేటాయించిన వేల ఎకరాల భూములు వాడుక లేకుండా పడి ఉన్నాయో, లేక డిస్ఇన్వెస్ట్‌మెంట్ పాలిటపడ్డాయో, లేదా రియల్ ఎస్టేట్ కార్యకలాపాలకు దారి మళ్లిస్తున్న వాస్తవాన్ని ప్రతినిధులు కేంద్రం దృష్టికి



తీసుకువెళ్లారు. ఈ భూముల అసలైన ఉద్దేశం కేవలం పరిశ్రమల అభివృద్ధి అని, దానికి భిన్నంగా వినియోగం జరుగుతున్నదని వారు విన్నవించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ భూములపై రెండు విధాలుగా

మిగితా 2వ పేజీలో




## కేసీఆర్ దమ్మేంటో ఒరిజినల్ కాంగ్రెస్ లీడర్లకు తెలుసు

-అసెంబ్లీలో ఆరు గ్యారంటీలు, హామీల అమలుపై చర్చించే సత్తా ఉందా..

-సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ కవిత సవాల్

-కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీకి పోస్టు కార్డులు..

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కేసీఆర్ దమ్మేంటో ఒరిజినల్ కాంగ్రెస్ నాయకులను అడిగితే తెలుస్తుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కేసీఆర్ పోరాడి తెలంగాణ సాధించారు కాబట్టే ఈరోజు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారనే విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సోనియాగాంధీ హామీ ఇచ్చిన మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వడంతో పాటు పింఛన్ల పెంపు హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ బుధవారం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో అబిడ్స్ జనరల్ పోస్ట్ ఆఫీస్ ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం సోనియాగాంధీకి పోస్ట్ కార్డులు పోస్ట్ చేశారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ, ఏపీ సీఎం చంద్రబాబును పిలిచి ప్రజాభవన్ లో హైదరాబాద్ బిర్యానీ పెట్టి గోదావరి నీళ్లను గిఫ్ట్ గా ఇచ్చిందే రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ కలలో కూడా తెలంగాణకు నష్టం చేయబోరని అన్నారు. అసెంబ్లీ సమావేశాలు పెట్టి ఆరు గ్యారంటీలు, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై చర్చించే సత్తా ఉందా అని నిలదీశారు. గ్యారంటీలపై, మహిళలకు, పింఛన్లు పొందే అవ్వాతాతలకు చేసిన మోసంపై చర్చిద్దామా అన్నారు. 2016లో అసలు పోలవరం –బనకచర్ల లింక్ ప్రాజెక్టు అనే ప్రస్తావనే లేదన్నారు. అబద్ధాలు ఆడటం రేవంత్ రెడ్డికి

మిగితా 2వ పేజీలో

# కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు

**పుణే మెట్రో, ఝరియా పునరావాసం, పొటాటో సెంటర్‌కు గ్రీన్ సిగ్నల్**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. అత్యవసర పరిస్థితి 50వ వార్షికోత్స వాన్ని పురస్కరించుకుని, కేబినెట్ రెండు నిమిషాల మౌనం పాటించి, ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా తీర్మానం ఆమోదించింది. ప్రజాస్వామ్యాన్ని కాపాడిన అనేక త్యాగాలను గుర్తుచేస్తూ కేబినెట్ ఈ తీర్మానం చేసినట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. అలాగే, పలు అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పుణే మెట్రో రెండో దశ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. ఈ దశలో 12.75 కిలోమీటర్ల పొడవు గల రెండు ఎలివేటెడ్ కారిడార్లు, 13 స్టేషన్లు ఉండనున్నాయి. చాందినీ చౌక్, బవ్ధాన్, కోత్రుడ్, ఖరడి, వాఘోలి ప్రాంతాలను మెట్రో సేవలు కలుపుతాయని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టు నాలుగేళ్లలో పూర్తి చేయాలని నిర్ణయించింది.

ఝరియా బొగ్గు గనుల నిర్వాసితుల పునరావాసం కోసం రూపొందించిన మాస్టర్ ప్లాన్‌కు రూ.5,940 కోట్లు మంజూరు చేసింది. నిర్వాసిత కుటుంబాలకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు మంత్రి వివరించారు. ఆగ్రా సింగ్నాలో దక్షిణాసియా ప్రాంతీయ పొటాటో సెంటర్ ఏర్పాటు కోసం రూ.111.5 కోట్లు కేటాయించింది. బంగాళాదుం ప ఉత్పత్తి, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, రవాణా, మార్కెటింగ్‌లో విలువ గొలుసు పెంచడం, ఉపాధి అవకాశాలు పెంచడం దీని ప్రధాన ఉద్దేశం. అంతేకాకుండా, యూపీ గౌతమ్ బుద్ధ నగర్‌లో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ ఏర్పాటుకు రూ.417 కోట్ల నిధులను కేటాయించింది.

# తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బోనాలు

- **రాష్ట్ర ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు**
- **ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చారిత్రాత్మక గోల్కొండ లో వెలిసిన జగదాంబిక ఎల్లమ్మ తల్లికి ఆషాడ మాసం తొలి బోనం సమర్పించడంతో జంటనగరాల్లో బోనాల సందడి ప్రారంభమవుతుందని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరు సుఖ శాంతులు, ఆయురారోగ్యాలతో జీవించాలనీ, రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. జంట నగరాల్లో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రూ. 20 కోట్ల నిధులు విడుదల చేసిందని సీఎం అన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి భద్రతా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

# చట్టపరంగా బనకచర్లను అడ్డుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

భారత సైన్యంలో ఇంజినీర్ ఇన్–చీఫ్ గా పనిచేసిన జనరల్ హార్బల్ సింగ్ ను తెలంగాణా రాష్ట్ర నీటిపారుదల శాఖకు సలహా దారుడిగా ఉండమని అహ్వానించామన్నారు అంతర్జాతీయ స్థాయిలో పేరు గడించిన టన్నెల్ టెక్నాలజీ నిపుణులు కర్నల్ పరిక్షిత్ మెహ్రా ఈ జులైలో రాష్ట్ర నీటిపారుదల శాఖలో చేరనున్నారని ఆయన పేర్కొన్నారు

అదేవిధంగా మెడిగడ్డ ,అన్నారం,సిందిళ్ళ బ్యారేజి లపై ఎన్.డి.ఎస్.ఏ ఇచ్చిన నివేదికలపై సమీక్షించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ధరణ పనులకై ఎన్.డి.ఎస్.ఏ డిజైన్ కన్సల్టెంట్ గా వ్యహారిస్తుందన్నారు.ఎన్.డి.ఎస్ ఏ ఇచ్చిన ఆదేశాలను సత్వరమే అమలులోకి తీసుకు రావాలని ఆయన అధికారులను ఆదేశించారు పునరుద్ధరణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు వీలుగా ప్రతివారం సమీక్షిస్తూ ఎప్పటికప్పుడు తనకు నివేదికను సమర్పించాలన్నారు.కేంద్ర జలసంఘం సూచనలకు అనుగుణంగా పనులను వేగవంతం చేయాలన్నారు.

డిండి ప్రాజెక్ట్ పై ఆయన మాట్లాడుతూ భూసేకరణ విషయమై సంబంధిత జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించాలన్నారు శ్రీశైలం ఎడమ కాలువ (ఎస్.ఎల్.బి.సి)పనుల పురోగతి పై సమీక్షించిన ఆయన పునరుద్ధరణ పనుల కోసమై అంతర్జాతీయ స్థాయి ఏజెన్సీ లతో చర్చించి ప్రతిపాదనలు స్వీకరిస్తున్నామన్నారు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తో పునరుద్ధరణ పనులు చేపట్టే విధంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చామని పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు ఖర్చుకు వెనకాడకుండా ముందుకు పోవాలని ఆయన అధికారులను ఆదేశించారు అదే సమయంలో నీటిపారుదల శాఖలో పెండింగ్ లో ఉన్న పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయాలని,బదిలీల తంతును వెంటనే పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

ప్రధాన ప్రాజెక్టులలో పూడిక తీత పనులపై ఆయన స్పందిస్తూ అనేక జలాశయాలు పూడికతో పూడి పోయి ఉన్నందున 20 నుండి 25 శాతం మేర నీటిసామర్థ్యం తగ్గిన నేపధ్యంలో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జాతీయ మార్గదర్శకాలకు అనుగుణంగా మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నాగార్జునసాగర్,నిజాంసాగర్ తదితర ప్రాజెక్టుల పూడిక తీత పనులపై ఆయన అడిగి తెలుసుకున్నారు ప్రత్యేకంగా నాగార్జునసాగర్ పూడిక తీత పనులను సత్వరం ప్రారంభించాలన్నారు.ఈ విషయమై ఆంద్రప్రదేశ్ ప్రభుత్వానికి సమాచారం అందించాలని అధికారులను సూచించారు దేవాదుల ప్రాజెక్టు మూడో దశ పనుల పురోగతితో పాటు సీతారామ ప్రాజెక్టుకు ప్రస్తుతం కేటాయించిన నిధుల పరిమితులకు లోబడి అదనపు ప్యాకేజి లను రూపొందించే అంశలపై అధికారులు దృష్టి సారించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

# జీడిమెట్ల మహిళ హత్యకేసు వివరాలు వెల్లడించిన డీసీపీ

**బలగం టీవి, హైదరాబాద్**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో హత్యకు గురైన అంజలి కేసులో కుమార్తెతోపాటు సహకరించిన ప్రేమికుడిని, అతని తమ్ముడ్ని పోలీసులు అరెస్టు చేశారు. వారిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం షాపూర్‌నగర్‌లోని బాలానగర్ జోన్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ కె.సురేష్‌కుమార్, అదనపు కమిషనర్ సత్యనారాయణ, ఏసీపీ పి.నరేష్‌రెడ్డి, సీఐ గడ్డం మల్లేష్‌తో కలిసి విలేకరుల సమావేశంలో వెల్లడించారు.న్యూ లాల్ బహదూర్‌నగర్‌లో నివసించే అంజలి తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందంలో కొన్నేండ్లుగా కళాకారిణిగా పని చేసింది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు. 10వ తరగతి చదువుతున్న 16 ఏండ్ల పెద్ద కుమార్తెకు కొద్ది నెలల కిందట ఇన్‌స్టాగ్రామ్‌లో నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండల కేంద్రానికి చెందిన శివతో పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారింది. విషయం తెలుసుకున్న తల్లి అంజలి.. ఉన్నత చదువులు చదవాలని, ఇది ప్రేమించే వయసు కాదని బాలికను మందలించింది. ఈ క్రమంలో జూన్ 19న బాలిక ఇంటి నుంచి వెళ్లిపోవడంతో తల్లి జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్, కిడ్నాప్ కేసు పెట్టింది. దాంతో బాలిక 21న రాత్రి ఇంటికి తిరిగొచ్చింది. అయితే, తల్లి తమ ప్రేమకు అడ్డు వస్తోందని, ఆమెను అంతమొందించాలని బాలిక పక్కా పథకం వేసి ప్రియుడికి చెప్పింది. అందుకు అతను ముందుగా నిరాకరించాడు. 'నువ్వు నా మాట వినకపోతే నీ పేరు రాసి ఆత్మహత్య చేసుకుంటా..' అని బాలిక బెదిరించడంతో అతను హత్య చేయడానికి ఒప్పుకున్నాడు. ఈ నెల 23న శివ అతని సోదరుడితో(బాలుడు) కలిసి బైక్‌పై షాపూర్‌నగర్‌లోని ఎన్ఎల్‌బి నగర్‌కు వచ్చారు. ఆ సమయంలో ఇంట్లో తన చెల్లెలు కూడా ఉండటంతో నిందితురాలు ఆమెకు మాయమాటలు చెప్పి బయటికి పంపించింది. ఆ తర్వాత అంజలీని చంపేశారు. తర్వాత ఇద్దరు అన్నదమ్ములు పారిపోయారు. తన తల్లి ప్రమాదవశాత్తు కింద పడిపోయిందని ఇరుగుపొరుగు వారికి చెప్పింది. రాత్రి 11:40 గంటల సమయంలో 100కు డయల్ చేయడంతోపాటు, జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో సీఐ గడ్డం మల్లేష్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకున్నారు. అర్ధరాత్రి రెండు బృందాలను నల్లగొండ జిల్లా కట్టంగూర్ గ్రామానికి పంపించి శివను అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని సంతోష్ నగర్‌లో అతని సోదరున్ని, సదరు బాలికను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. అంజలిని తామే హత్య చేసినట్టు ఒప్పుకున్నారని డీసీపీ తెలిపారు. నిందితులను 24 గంటల వ్యవధిలో పట్టుకున్న పోలీసు బృందాలను ప్రత్యేకంగా అభినందించారు.

# మెట్రో ఫేజ్-2పై కేంద్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరం

- **మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్ మెట్రో ఫేజ్–2పై కేంద్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమని రాష్ట్ర ఐటీ, పరిశ్ర మల, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శిం చారు. బుధవారం నాడిక్కడ కేంద్ర మంత్రులు పియూష్ గోయల్, అశ్వినీ వైష్టవ్, కుమారస్వామిలతో ఆయన భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేంద్ర మంత్రులకు విజ్ఞప్తులను అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్–2 గురించి సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోడీ, కేంద్ర మంత్రిని కలిసి విజ్ఞాపనలు ఇచ్చినప్పటికీ కేంద్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకోలేదన్నారు. పూర్తిస్థాయి డీపీఆర్ కేంద్రానికిచ్చామని, ఈ కేబినెట్‌లో అనుమతి వస్తుందని భావించామన్నారు. రేర్ ఎర్త్ ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించడంతో తెలంగాణ తయారీ రంగంపై తీవ్ర ప్రభావం చూపు తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖమంత్రి అశ్విని వైష్టవ్‌తో శ్రీధర్ బాబు భేటీ అయ్యారు. ఈ ఆంక్షల విషయంలో తక్షణ జోక్యం కా వాలని కోరారు. పలు ప్రముఖ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహ నాల తయారీ కంపెనీలు రేర్ ఎర్త్ మాగ్నెట్లు, కీలక ముడి పదార్థాలు, రసాయనాల దిగుమతుల్లో చైనాపై ఆధారప డటం వల్ల తీవ్ర అవరోధాలు ఎదుర్కొంటున్నామని తెలిపా రు. ప్రస్తుత పరిస్థితి ఉత్పత్తి స్థాయితోపాటు ఉపాధి అవకా శాలపైనా ప్రభావం చూపే ప్రమాదం ఉన్నందున ప్రత్యా మ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు.

రాష్ట్రంలో పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభి వృద్ధికి కేంద్రం సహకారం అందించాలని పీయూష్ గోయల్ ను కోరారు. పలు ఇండస్ట్రియల్ కారిడార్ల అభివృద్ధి వివ రాలు ఆయనకు తెలిపారు. జహీరాబాద్‌లోని ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టుకు అవసరమైన మౌలిక సదుపాయాలకు రూ.400 కోట్ల నిధులు పీఎం గతిశక్తి పథకం కింద మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల హైదరాబాద్–వరంగల్ ఇండస్ట్రియల్ కారిడార్ (హెచ్‌డబ్ల్యూఐసీ) నిలిచిపోయిందని, అందులో భాగమైన ఫార్మా సిటీని ప్రభుత్వం ఇప్పుడు 'ఫ్యూచర్ సిటీ'గా అభివృద్ధి చేస్తోందని తెలిపారు. అందులో భాగంగానే వరంగల్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి సహా పలు నోడ్స్‌కు కేంద్రం నిధులు విడుదల చేయాలని కోరారు. కేంద్రం ప్రతిపాదించిన 100 పారిశ్రామిక పార్కుల పథకంలో తెలంగాణకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఇప్పటికే ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తమ అభిప్రాయాలు పంపినట్టు గుర్తు చేశారు. హైదరాబాద్‌లో జాతీయ డిజైన్ సెంటర్ (ఎన్‌డీసీ) ఏర్పాటు చేస్తే దేశవ్యాప్తంగా డిజైన్ థింకింగ్‌కు కేంద్రంగా మారుతుందని వివరించారు. ఆత్మ నిర్భర్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేస్తోందని, కేంద్రంతో కలిసి వికసిత్ భారత్ 2047 లక్ష్యం సాధనలో రాష్ట్రం ముందుంటుందని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు.

# భూసంబంధిత సమస్య పరిష్కరిచండి

(మొదటి పేజీ తరువాయి)

పరిష్కారం కోరుతోంది. ఒకటి ఈ పరిశ్రమలను పునరుద్ధరించడం, లేదా రెండవది ప్రస్తుత మార్కెట్ విలువకు తగిన న్యాయ పరిహారం చెల్లించడం. తెలంగాణ హక్కులను కాపాడేందుకు సమయోచిత, న్యాయసమ్మతమైన, సమాఖ్య స్ఫూర్తికి తగిన పరిష్కారం అవసరం అని ప్రతినిధులు హైలైట్ చేశారు. ఈ సమావేశంలో పరిశ్రమల పునరుత్థానం ద్వారా ఉపాధి అవకాశాలు, ప్రాంతీయ అభివృద్ధి కల్పించడం లక్ష్యమని వారు స్పష్టంచేశారు.

# రెండుసార్లు 10వ తరగతి పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌సీఎఫ్) ముసాయిదా కమిటీ ఇప్పటికే సూచించింది. ఇస్రో మాజీ ఛైర్మెన్ కె.కస్తూరి రంగన్ సారథ్యంలోని ఈ కమిటీ 11, 12వ తరగతి విద్యార్థులకు సెమిస్టర్ విధానాన్ని కూడా ప్రతిపాదించింది. వాస్తవానికి, బోర్డు పరీక్షలను సంస్కరించడం ఇది తొలిసారేమీ కాదు. 2009లో పదో తరగతికి సీసీఈ (కంటిన్యూస్, కాంప్రెహెన్సివ్ ఎవల్యూషన్) విధానాన్ని తీసుకువచ్చారు. ఆ తర్వాత 2017లో దీన్ని రద్దు చేసి, మళ్లీ పాత విధానాన్నే అమలు చేశారు. కోవిడ్ సమయంలోనూ 10, 12 తరగతుల వార్షిక పరీక్షలను ఏడాదికి రెండు విడతలుగా నిర్వహించినా, తిరిగి పాత పద్ధతినే కొనసాగిస్తున్నారు.

# కేసీఆర్ దమ్మేంటో ఒరిజినల్ కాంగ్రెస్ లీడర్లకు తెలుసు

(మొదటి పేజీ తరువాయి)

అలవాటుగా మారిందన్నారు. హామీల అమలు నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి తాను ముఖ్యమంత్రి అన్న విషయం గుర్తించి హుందాగా వ్యవహరించాలని హితవు పలికారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్ పార్టీని ప్రజలు క్షమించబోరని అన్నారు.

సోనియాగాంధీ ఎన్నికలకు ముందు తెలంగాణ వచ్చి హామీ ఇచ్చారు కాబట్టే ప్రజలు నమ్మి కాంగ్రెస్ పార్టీని గెలిపించారని ఎమ్మెల్సీ కవిత అన్నారు. సోనియాగాంధీ హామీ ఇచ్చినట్టుగా మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వాలని, వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులు, ఇతర పింఛన్ లబ్ధిదారులకు నెలకు రూ.4 వేలు, వికలాంగులకు నెలకు రూ.6 వేల పింఛన్ ఇచ్చేలా రేవంత్ రెడ్డికి సోనియా గాంధీ ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఇందుకోసమే సోనియాగాంధీకి వేలాది పోస్టు కార్డులు రాస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 18 నెలలు పూర్తయినా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. సోనియాగాంధీ సంతకం పెట్టిన గ్యారంటీ కార్డులను ఎన్నికలకు ముందు ఇంటింటికీ పంపి ప్రజలను మోసం చేశారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, నాయకులు మహేందర్, సంపత్ గౌడ్, రూప్ సింగ్, అర్చనా సేనాపతి, లలిత యాదవ్, మనోజా గౌడ్, శోభ, లావణ్య, కవిత, పరమేశ్వరి, రజిత రెడ్డి, ఈగ సంతోష్, మనోజ్ గౌడ్, నరేందర్ యాదవ్, రాము యాదవ్, అర్ వి మహేందర్ కుమార్, తెలంగాణ శేఖర్ చారి, విష్ణువర్ధన్ ,ప్రతాప్, మహేందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న కోడెల దాణ కోసం పచ్చిగడ్డి సాగు చేయాలి

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, వేములవాడ**



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన గోశాలలోని కోడెల దాణ కోసం పచ్చి గడ్డిని సాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారుల ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు.బుధవారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ గోశాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా గోశాల ఆవరణ, కోడెలు, గడ్డిని పరిశీలించారు అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝాగోశాల ఆవరణలో మట్టిని చదును చేయించాలని, నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని,కోడలకు నిత్యం పచ్చిగడ్డి అందించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వేములవాడ పరిధిలోని హనుమక్కపల్లిలో 22 ఎకరాలు, మర్రిపల్లిలో 40 ఎకరాలు, మూఢపల్లిలోని 20 ఎకరాలు మొత్తం 82 ఎకరాల ప్రభుత్వ భూముల్లో పచ్చి గడ్డి పెంపకానికి వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డిని ఆదేశించారు. అలాగే గోశాలలో పనిచేసేందుకు ఇటీవల నియమించిన సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని, వారికి డ్రెస్ కోడ్ ,ఐడి కార్డ్ అందించాలని, సిబ్బంది నిర్వర్తించాల్సిన విధులపై శిక్షణ అందజేయాలని, అలాగే సైలేజ్ బేరింగ్ మిషన్ కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ రాజన్న ఆలయ ఇన్చార్జి ఈవో రాధాభాయ్, పశుసంవర్ధక అధికారి రవీందర్ రెడ్డి, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



**పౌష్టికాహారం అందిస్తూ.. పాఠాలు బోధించాలి..**

అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తూ పాఠాలు బోధించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు అందిస్తున్న కోడిగుడ్లు, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. పిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ పాఠాలు బోధించాలని సూచించారు.

అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలలో తరగతులను పరిశీలించారు. స్కూల్ లో ప్రధానోపాధ్యాయుడు విధులకు హాజరు కాకపోవడంతో పరిశీలించి, విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారి వినోద్ కుమార్ ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు.

# 29న కోడెల పంపిణీ కార్యక్రమం

**-అర్హులైన రైతులు సంబంధిత పత్రాలతో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి..**

**-ఆలయ ఇన్చార్జి ఈవో రాధాబాయి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి**

**బలగం టీవీ, వేములవాడ**



ఈ నెల 29వ తేదీన వేములవాడ తిప్పాపూర్ లోని గోశాలలో కోడెలను పంపిణీ చేయనున్నట్లు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఇన్చార్జి ఈవో రాధాబాయి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేములవాడ తిప్పాపూర్ గోశాలలోని 250 కోడెలను ఆదివారం ఉదయం పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతులు అర్హులని స్పష్టం చేశారు. కోడెల కోసం అర్హత కలిగిన రైతులు జిల్లా వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన రైతులు పట్టాదారు పాస్ బుక్ ఆధార్ కార్డ్ మొదలగు సంబంధిత ధ్రువ పత్రాలతో ఈ వెబ్సైట్ https://rajannasircilla.telangana.gov.in/ లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. కోడెలు పంపిణీ చేసే రోజున రైతులు ఆన్లైన్లో నమోదు చేసిన ఆయా సర్టిఫికెట్లు పత్రాలు వెంట తీసుకురావాలని తెలిపారు. అర్హులైన రైతులకు మాత్రమే జియో ట్యాగింగ్ కలిగి ఉన్న కోడెలను పంపిణీ చేయనున్నామని అన్నారు. జియో ట్యాగింగ్ ఉన్న కోడెలు, వెబ్సైట్ లో రైతుల వివరాలు నమోదు చేయడంతో జీవాలు పక్కదారి పట్టే అవకాశం ఉండదని, భవిష్యత్తులో వాటి సంరక్షణను పరిశీలించవచ్చునిస్పష్టం చేశారు. కోడెలను తీసుకువెళ్లే రైతులు వాటి సంరక్షణ బాధ్యతను సక్రమంగా పక్కాగా చూసుకోవాలని సూచించారు.




## మాయని మచ్చ ఎమర్జెన్సీ..

**-మాజీ ఎంపీ బూర నర్సయ్య**

**బలగం టీవీ, సిరిసిల్ల**

కాంగ్రెస్ అధికార దాహానికి ఎమెర్జెన్సీ పాలన ఓ నిదర్శనమని,ఎమర్జెన్సీ పాలన దేశానికి ఓ మాయని మచ్చ అని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ అన్నారు.యాభై ఏళ్ల క్రితం దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన ఎమర్జెన్సీని భారత రాజ్యాంగ వ్యతిరేక దినంగా పరిగణిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా బిజెపి ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ హాజరై ర్యాలీలో పాల్గొన్నారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుండి గాంధీ చౌక్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమర్జెన్సీ సమయంలో జైలుకు వెళ్లిన తన్నీరు ప్రభాకర్ రావు, గాల్ రెడ్డిలను సన్మానించారు. ఈ సందర్భంగా నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ యాభై ఏళ్ల క్రితం ఇదే రోజున దేశంలో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని విధించి రాజ్యాంగాన్ని హత్య చేశారని ఆరోపించారు. ఇందిరాగాంధీ 1975 లో అధికారం కొరకు, అహంకారంతో కోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఎమర్జెన్సీని విధించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని అన్నారు. ఈ ఎమర్జెన్సీ ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థలను అణిచివేస్తూ ఒక కుటుంబం కోసం చేసిన పని అని అన్నారు. ఎమర్జెన్సీ భారత ప్రజలు మరచిపోలేని చీకటి రోజు అని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులు, రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. అధికారం, అహంకారం కొరకు ఎమర్జెన్సీని తీసుకురావడం వల్ల దేశానికి నష్టం జరిగిందన్నారు. ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తూ బిజెపి అగ్రనాయకులు అద్వానీ, వాజపేయి, మోడీ లు నినదిస్తే అణిచివేసేందుకు కుట్రలు పన్నారని అన్నారు. ఎమర్జెన్సీ రోజును ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘన దినోత్సవమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్ర మహేష్ అల్లాడి రమేష్,స్టేట్ కౌన్సిల్ మెంబర్ మ్యాన రాంప్రసాద్,మహిళా మోర్చా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ,ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి దేవేందర్ యాదవ్,కరీంనగర్ పార్లమెంట్ కో కన్వీనర్ ఆడెపు రవీందర్, సిరిసిల్ల అసెంబ్లీ కన్వీనర్ మల్లారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు రాగుల రాజిరెడ్డి, ఓబిసి మోర్చా అధ్యక్షులు నంద్యాడపు వెంకటేష్, జిల్లా అధికార ప్రతినిధి నవీన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ డీలర్లకు ఖరీఫ్ సీజన్‌లో ఎంత ఎరువుల అలాట్మెంట్ ఉంది..

**-రైతులకు ఎరువులు సకాలంలో అందేలా పటిష్ట చర్యలు..**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**



ప్రైవేట్ డీలర్లకు ఖరీఫ్ సీజన్ లో ఎంత ఎరువుల అలాట్మెంట్ ఉంది, రైతులకు ఏ మేర విక్రయం చేశారు, ప్రస్తుతం ఎంత అందుబాటులో ఉంది వంటి వివరాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆరా తీశారు.బుధవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ఎరువుల సరఫరా పై కంపెనీ ప్రతినిధుల తో సమీక్షించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ. సిరిసిల్ల జిల్లాలో అవసరమైన మేర స్టోరేజి అందుబాటులో ఉందని, రైతులకు అవసరమైన మేర ఎరువులను స్టోర్ చేయాలని అన్నారు. ప్రతి డీలర్ నిబంధనల ప్రకారం ఆన్ లైన్ ఈపాస్ యంత్రాల ద్వారా మాత్రమే ఎరువుల విక్రయం చేయాలని ఆదేశించారు.బల్క్ స్టాక్ పెట్టుకొని కృత్రిమ కొరత సృష్టించడం వంటి పనులకు ఆస్కారం లేదని స్పష్టం చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎరువుల షాపులకు ఎంత స్టాక్ ఏ సమయంలో సరఫరా చేస్తున్నారు, ప్రతి షాప్ వద్ద ప్రస్తుతం ఎంత స్టాక్ ఉంది వివరాలు అందించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జలి బేగం, వివిధ ఎరువుల కంపెనీ ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కోనరావుపేట మోడల్ స్కూల్‌లో అసిస్టెంట్ కుక్ కు దరఖాస్తుల ఆహ్వానం

**బలగం టీవీ, కోనరావుపేట**



రాజన్న సిరిసిల్ల జిల్లా, కోనరావుపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి మురళి నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకోవడానికి జనవరి 1, 2025 నాటికి 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలి. ఏదైనా విద్యార్హత కలిగిన వారు ఈ పోస్టుకు అర్హులని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను నేరుగా కోనరావుపేట మండల విద్యాధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. దరఖాస్తులు సమర్పించడానికి చివరి తేదీ జూన్ 27 అని మురళి నాయక్ స్పష్టం చేశారు.

## యువత క్రీడల్లో రాణించాలి : చల్మెడ



**పట్టణంలో ముద్రకోల వెంకన్న ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన చల్మెడ**

**బలగం టీవీ, వేములవాడ**

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. బుధవారం పట్టణంలోని 17వ వార్డు మాజీ కౌన్సిలర్ ముద్రకోల వెంకన్న ఆధ్వర్యంలో ఐబీపీ గ్యాస్ గోదాం మైదానంలో ఏర్పాటుచేసిన ముద్రకోల వెంకన్న ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ను ఆయన టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహారావు క్రీడాకారులతో మాట్లాడి, టోర్నమెంట్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. యువత క్రీడల ద్వారా తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. యువతను ప్రోత్సహిస్తూ ఇలాంటి టోర్నమెంట్ నిర్వహిస్తున్న మాజీ కౌన్సిలర్ ముద్రకోల వెంకటేశంను ఆయన అభినందించారు. అనంతరం నిర్వాహకులు, క్రీడాకారులు చల్మెడ లక్ష్మీనరసింహారావును శాలువతో సత్కరించి సన్మానించారు. మూడు రోజులపాటు జరిగే ఈ టోర్నమెంట్‌లో 17వ వార్డు నుండి నాలుగు జట్లు పాల్గొంటున్నాయని, శుక్రవారం ఫైనల్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సీనియర్ నాయకులు రామతీర్థపు రాజు, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, జోగిని శంకర్, సిరిగిరి చందు, గోలి మహేష్, నాయకులు కొండ కనుకయ్య, అంజద్ పాషా, సందీప్, పర్వేజ్, గణేష్, రాకేష్, గోసుకుల రవి, మల్లేశం, శ్రీనివాస్ రెడ్డి, టోర్నమెంట్ నిర్వాహకులు వడ్లూరి విష్ణు, మిరియాల సంతోష్, కందుకురు తారక్, శీలం విజయ్ యాదవ్, మద్దినేని హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై చిత్రలేఖనం పోటీలు, అవగాహన కార్యక్రమాలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



జిల్లా ఎస్పీ మహేష్ బి గితే ఆదేశాల మేరకు, మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా–అవగాహన వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ వారోత్సవాలలో భాగంగా, వేములవాడ రూరల్ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు చిత్రలేఖనం పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడ రూరల్ ఎస్ఐ అంజయ్య మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే డ్రగ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని నొక్కి చెప్పారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల గురించి మరియు వాటి వల్ల కలిగే నష్టం గురించి విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండటం అత్యవసరమని తెలిపారు. మాదక ద్రవ్యాల వలన కలిగే దుష్ప్రభావాల గురించి విద్యార్థులకు అవగాహన ఏర్పడితే, వారు వాటి జోలికి వెళ్లకుండా ఉంటారని, అంతేకాకుండా వారి చుట్టుపక్కల ఉన్నవారికి కూడా అవగాహన కల్పించగలరని వివరించారు. తద్వారా ప్రతి ఒక్కరికీ మాదక ద్రవ్యాల పట్ల అవగాహన ఏర్పడుతుందని అన్నారు. మాదక ద్రవ్యాల గురించి ఏదైనా సమాచారం తెలిస్తే తక్షణమే టోల్ ఫ్రీ నెంబర్ 1908 కి తెలియజేయాలని శ్రీనివాస్ కోరారు.

## ఇంగ్లండ్ అండర్ 19పై
# భారత అండర్ 19 జట్టు విజయం



**బలగం టీవీ, హైదరాబాద్**

ఇంగ్లండ్ పర్యటనలో శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని సీనియర్ భారత జట్టు ఓటమి చెందగా, అండర్-19 జట్టు విజయ పరంపరకు నాంది పలికింది. బుధవారం ఇంగ్లండ్ అండర్-19 జట్టుతో జరిగిన వన్డేలో భారత్ అండర్-19 జట్టు 231 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. అండర్-19 జట్టుకు ఐపీఎల్ సెన్సేషన్ ఆయుష్ మాత్రే సారథ్యం వహిస్తుండగా, 14 ఏళ్ల సిక్సర్ల పిడుగు వైభవ్ సూర్యవంశీ జట్టులో ఉన్నాడు. అయితే ఈ మ్యాచ్‌లో ఈ ఇద్దరూ నిరాశపరిచారు. కానీ గుజరాత్‌కు చెందిన ట్రక్కు డ్రైవర్ కుమారుడు హర్వాన్ష్ పంగాలియా అజేయ శతకంతో చెలరేగి జట్టు విజయంలో ప్రధాన పాత్ర వహించాడు.

భారత యువ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 444 పరుగుల భారీ స్కోరు చేసింది. హర్వాన్ష్ పంగాలియా 52 బంతుల్లో 8 ఫోర్లు, 9 సిక్సర్లతో 103 నాటౌట్ చేసి ఆకట్టుకున్నాడు. రాహుల్ కుమార్ 73 (60 బంతులు), కనిష్క చౌహాన్ 79 (67 బంతులు), అంబ్రిష్ 72 (47 బంతులు) పరుగులతో సత్తా చాటారు. ఆయుష్ మాత్రే(1), వైభవ్ సూర్యవంశీ(17)లు నిరాశపర్చారు. ఇంగ్లండ్ యువ జట్టు 41.1 ఓవర్లలో 211 పరుగులకే ఆలౌటయ్యింది. సెంచరీతో చెలరేగిన భారత వికెట్ కీపర్ హర్వాన్ష్ పంగాలియాది గుజరాత్‌లోని రాన్ ఆఫ్ కచ్‌లోని గాంధీదామ్ అనే చిన్నపట్టణం. అయితే వీరి కుటుంబం కెనడాలో స్థిరపడింది. అక్కడ అతని తండ్రి బ్రాంప్టన్‌లో ట్రక్కు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.

# ఇది సమష్టి వైఫల్యం

- **బుమ్రా మూడు మ్యాచ్‌లు మాత్రమే ఆడుతాడు.**
- **టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్**



**బలగం టీవీ, హైదరాబాద్**

ఇంగ్లండ్‌తో తొలి టెస్ట్ పరాజయంపై టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ స్పందించాడు. ఇది సమష్టి వైఫల్యమని, ఏ ఒకరి వల్లో ఈ పరాజయం ఎదురవ్వలేదని స్పష్టం చేశాడు. తమ జట్టు ఓడినా.. గెలిచినా.. కలిసికట్టుగానే చేస్తుందని తెలిపాడు. తొలి ఇన్నింగ్స్‌లో 570-580 పరుగులు చేసి ఉంటే ఫలితం మరోలా ఉండేదని అభిప్రాయపడ్డాడు. 'ఈ మ్యాచ్ ఓటమికి ఏ ఒక్క ఆటగాడిని లేదా జట్టును నిందించడానికి నేను ఇక్కడ లేను. మేం కలిసి గెలుస్తాం. కలిసి ఓడిపోతాం. భారత బౌలింగ్ విభాగం అనుభవం లేనిది. సిరాజ్, బుమ్రా మినహా మిగతా బౌలర్లకు టెస్ట్ క్రికెట్ ఆడిన అనుభవం లేదు. వీరిలో ఒకరు మూడు, మరొకరు ఐదు మ్యాచ్‌లు ఆడితే.. ఇంకొకరు అరంగేట్రమే చేయలేదు. 2022లో జట్టులో 40 మ్యాచ్‌లు ఆడిన అనుభవం కలిగిన పేసర్లు ఉన్నారు కాబట్టి 20 వికెట్లు తీసేవారు. కానీ ప్రస్తుత బౌలింగ్ విభాగానికి అంత అనుభవం లేదు. వారికి తగిన సమయం ఇవ్వాలి. ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్ వంటి బౌలర్లు భవిష్యత్తులో రాణించడానికి తగిన మద్దతు ఇవ్వాలి. కేవలం ఒక టెస్ట్ ఆధారంగా వారిని అంచనా వేయడం సరికాదు. తొలి ఇన్నింగ్స్‌లో 570-580 పరుగులు చేసి ఉంటే మ్యాచ్‌పై పట్టు సాధించేవాళ్లం.లోయరార్డర్ బ్యాటింగ్ వైఫల్యం నిరాశకు గురిచేసింది. యశస్వి జైస్వాల్ వంటి అత్యుత్తమ ఆటగాళ్లు క్యాచ్‌లు వదిలేయడం సరికాదు. కానీ ఏ ఆటగాడు ఉద్దేశపూర్వకంగా అలా చేయరు. వరల్డ్ బెస్ట్ ఆటగాళ్లు కూడా క్యాచ్‌లు వదిలేస్తారు. శార్దూల్ ఠాకూర్‌ను బౌలింగ్ ఆల్‌రౌండర్‌గానే జట్టులోకి తీసుకున్నాం. కానీ రవీంద్ర జడేజా అద్భుతంగా బౌలింగ్ చేయడంతో కెప్టెన్ సహజంగానే తక్కువ ఓవర్లు ఇచ్చి ఉంటాడు. రెండో ఇన్నింగ్స్‌లో శార్దూల్ కీలకమైన రెండు వికెట్లు తీసాడు. కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్‌కు ఇదే తొలి మ్యాచ్. అతనికి కాస్త సమయం ఇవ్వాలి. కెప్టెన్‌గా సక్సెస్ అవ్వడానికి కావాల్సిన అన్ని లక్షణాలు శుభ్‌మన్ గిల్‌లో ఉన్నాయి. కెప్టెన్‌గా అరంగేట్ర మ్యాచ్‌లోనే సెంచరీ సాధించాడు. ఈ సిరీస్‌లో జస్‌ప్రీత్ బుమ్రా మూడు మ్యాచ్‌లు మాత్రమే ఆడుతాడు. అతను ఆడే తదుపరి రెండు మ్యాచ్‌లు ఏంటా అనేవి ఇంకా నిర్ణయించలేదు. అతని వర్క్‌లోడ్‌ను మేం పరిశీలించాల్సి ఉంది. యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్ సెంచరీలు చేయడంతో పాటు రిషభ్ పంత్ రెండు సెంచరీలు చేశాడు. వాస్తవానికి ఇది అద్భుతమైన ఆరంభం.'అని గౌతమ్ గంభీర్ చెప్పుకొచ్చాడు.

# మంచు విష్ణు 12 జ్యోతిర్లింగాల యాత్ర పూర్తి..

**బలగం టీవీ, హైదరాబాద్**






ప్రముఖ సినీ నటుడు, నిర్మాత మంచు విష్ణు గత కొంతకాలంగా దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న జ్యోతిర్లింగాలను సందర్శిస్తూ వస్తున్నారు. ఈ యాత్రలో భాగంగా ఆయన కేదార్‌నాథ్, రామేశ్వరం, సోమనాథ్ వంటి పుణ్యక్షేత్రాలను సందర్శించారు. ఇక 12 జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకోవడంతో ఆయన 12 జ్యోతిర్లింగాల యాత్ర పూర్తయింది. తాజాగా ఈ విషయాన్ని మంచు విష్ణు వెల్లడించారు. శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయంలో దర్శనం పూర్తవడంతో, పన్నెండు జ్యోతిర్లింగాలను దర్శించుకోవాలన్న తన కోరిక నెరవేరిందని విష్ణు ఆనందం వ్యక్తం చేశారు. "నా మనసు నిండిపోయింది. నా ఆత్మ ఆశీర్వదించబడినట్లు అనిపిస్తుంది. జీవితం ప్రస్తుతం సానుకూలత, కృతజ్ఞత మరియు శాంతితో నిండి ఉంది" అని ఆయన ట్వీట్ చేశారు. జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న 'కన్నప్ప' చిత్రం తన హృదయానికి చాలా దగ్గరైనదని, ఈ సినిమా కథ తాను ప్రస్తుతం అనుభవిస్తున్న స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని ఆయన పేర్కొన్నారు. హర్ హర్ మహాదేవ్! #Kannappa27thJune అంటూ ఆయన తన ఎక్స్ ఖాతాలో రాసుకొచ్చారు.

# కెరీర్‌లో బెస్ట్ ర్యాంక్‌కు రిషబ్ పంత్

## అగ్రస్థానంలో బూమ్రా

**బలగం టీవీ, హైదరాబాద్**



ఇంగ్లండ్‌తో జరిగిన లీడ్స్ టెస్ట్‌లో అద్భుత శతకాలతో చెలరేగిన రిషబ్ పంత్ తన టెస్ట్ కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంక్ సాధించాడు. ఐసీసీ బుధవారం విడుదల చేసిన తాజా టెస్ట్ ర్యాంకింగ్స్‌లో పంత్ 7వ స్థానానికి ఎగబాకాడు. లీడ్స్ టెస్ట్‌లో పంత్ తొలి ఇన్నింగ్స్‌లో 134, రెండో ఇన్నింగ్స్‌లో 118 పరుగులు సాధించాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో సెంచరీలు చేసిన రెండో వికెట్ కీపర్‌గా (మొదట జింబాబ్వేకు చెందిన ఆండీ ఫ్లవర్) నిలిచాడు. శుభ్‌మాన్ గిల్ ఐదు స్థానాలు పైకి ఎగబాకి టాప్-20లోకి చేరాడు. లీడ్స్ టెస్ట్‌లో గిల్ శతకం సాధించిన సంగతి తెలిసిందే. టాప్-20లో పంత్, గిల్‌తో పాటు యశస్వి జైస్వాల్ (4వ స్థానం) నిలిచాడు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో జస్‌ప్రీత్ బుమ్రా 14వసారి ఐదు వికెట్లు తీసి తన అగ్రస్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు.

. లీడ్స్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో యశస్వి



సైతం సెంచరీ చేశాడు. టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో పెద్దగా మార్పులు జరుగలేదు. హెడింగ్లీ టెస్ట్‌లో 14వసారి ఐదు వికెట్లు తీసిన తర్వాత భారత ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో 62 పరుగులు, సెకండ్ ఇన్నింగ్స్‌లో 149 పరుగులు చేసి ఇంగ్లండ్ విజయంలో కీలకపాత్ర పోషించిన బెన్ డకెట్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. ఈక్రమంలో టెస్ట్ బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో ఐదు స్థానాలు ఎగబాకి ఎనిమిదో స్థానానికి చేరుకున్నాడు.

ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్ ఓలీ పోప్ మూడు స్థానాలు ఎగబాకి 19వ స్థానానికి, జామీ స్మిత్ ఎనిమిది స్థానాలు ఎగబాకి 27వ స్థానానికి చేరుకున్నారు. ఇంగ్లండ్ సీనియర్ ప్లేయర్ జో రూట్ నంబర్ వన్ స్థానంలో కొనసాగుతున్నాడు. హ్యారీ బ్రూక్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. న్యూజిలాండ్‌కు చెందిన కేన్ విలియమ్సన్ మూడోస్థానంలో ఉన్నాడు. లీడ్స్‌లో ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ బాల్, బ్యాట్‌తోనూ రాణించగా.. ఆల్‌రౌండర్ల జాబితాలో మూడుస్థానాలు మెరుగుపరుచుకొని ఐదోప్లేస్‌కు చేరాడు. టెస్ట్ ఆల్ రౌండర్ల జాబితాలో టీమిండియా ప్లేయర్ రవీంద్ర జడేజా అగ్రస్థానంలో ఉన్నాడు. శ్రీలంక-బంగ్లాదేశ్‌తో మధ్య తొలి టెస్ట్ డ్రాగా ముగియగా.. ఈ మ్యాచ్‌లో రాణించిన పలువురు ఆటగాళ్ల ర్యాంకింగ్స్‌నూలో మార్పులు జరిగాయి. గాలెలో టెస్టులో 163 పరుగులు చేసిన బంగ్లా ప్లేయర్ ముష్ఫికర్ రహీమ్ 11 స్థానాలు ఎగబాకి 28వ స్థానానికి చేరుకోగా.. నజ్ముల్ హొస్సేన్ శాంటో ఒకే మ్యాచ్‌లో రెండు సెంచరీలు చేసి 21 స్థానాలు ఎగబాకి 29వ స్థానానికి చేరుకున్నాడు.



## జార్జియాలో షెడ్యూల్ పూర్తి చేసుకున్న 'అఖండ 2'

- **సెప్టెంబర్ 25న దసరా కానుకగా ప్రపంచవ్యాప్తంగా రిలీజ్**

**బలగం టీవీ, హైదరాబాద్**

నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్లో తెరకెక్కుతున్న సీక్వెల్ చిత్రం 'అఖండ 2' (తాండవం) షూటింగ్ శరవేగంగా సాగుతుంది. బ్లాక్‌బస్టర్ మూవీ 'అఖండ'కి సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమాకు ఇప్పటికే మహాకుంభమేళా ప్రాంగణం, ప్రయాగ్‌రాజ్‌లోని కీలక సన్నివేశాలు చిత్రీకరణ పూర్తయింది. తాజాగా జార్జియాలో చిత్రీకరించిన షెడ్యూల్‌ను కూడా యూనిట్ పూర్తి చేసిందని సమాచారం. జార్జియాలో పలు యాక్షన్, సెంటిమెంట్ సన్నివేశాలను తెరకెక్కించిన తర్వాత అఖండ 2 టీమ్ తదుపరి షెడ్యూల్ రామోజీ ఫిల్మ్ సిటీలోని కీలక ఎపిసోడ్‌ల చిత్రీకరణతో కొనసాగించనుంది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తుండగా, సంయుక్త మీనన్ కథానాయికగా నటిస్తోంది. యువహీరో ఆది పినిశెట్టి విలన్ పాత్రలో కనిపించనున్నాడు. ఈ సినిమా 2025 సెప్టెంబర్ 25న దసరా కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. బాలయ్య ఈ సినిమాతో మరోసారి అఘోరి అవతారంలో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు.




## రూ.100 కోట్ల క్లబ్‌లో 'కుబేర'

**బలగం టీవీ, హైదరాబాద్**

ధనుష్, అక్కినేని నాగార్జున ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కుబేర' బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసింది. జూన్ 20న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా, ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు రూ.100 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు సాధించిందని అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంగా, తమ సినిమాను ఇంతగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు చిత్ర యూనిట్ కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ చిత్రంలో ధనుష్ 'దేవా' అనే పాత్రలో, నాగార్జున 'దీపక్' అనే పాత్రలో నటించి ప్రేక్షకులను మెప్పించారు. ముఖ్యంగా, ఒక భిక్షగాడి పాత్రలో ధనుష్ కనబరిచిన అద్భుత నటనకు సర్వత్రా ప్రశంసలు వస్తున్నాయి. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన ఒక వ్యక్తికి, వీధుల్లో బ్రతికే ఒక నిరుపేద వ్యక్తికి మధ్య జరిగే సంఘర్షణే ఈ సినిమా ప్రధాన కథాంశం. రష్మిక మందన్న కథానాయికగా నటించిన ఈ సినిమా సుమారు మూడు

## హాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న వరలక్ష్మి శరత్ కుమార్

**బలగం టీవీ, హైదరాబాద్**




వరలక్ష్మి శరత్‌కుమార్‌ను తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. తమిళ నటుడు శరత్‌కుమార్ కుమార్తెగా సినీ రంగంలో ప్రవేశించిన వరలక్ష్మి శరత్‌కుమార్, అతి తక్కువ సమయంలోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. తమిళంతో పాటు తెలుగు, మలయాళం వంటి భాషల్లో భేదం లేకుండా వరుస సినిమాలు చేస్తూ దూసుకుపోతోంది. ఇప్పుడు ఆమె హాలీవుడ్‌లో అడుగుపెట్టబోతోంది. బ్రిటిష్ నటుడు జెరెమీ ఐరన్స్ సరసన నటిస్తూ హాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తోంది. వెటరన్ డైరెక్టర్ చంద్రరత్నం దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాను శ్రీలంకలో షూట్ చేస్తున్నారు. RIZANA-A Caged Bird పేరుతో రూపొందుతున్న ఈ సినిమా వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది.